www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 2 మార్చి 2023

5

కాకినాడ



ఆదిత్య ఫార్మసీ కళాశాలకు నాక్-ఎ గుర్తింపు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలకు గుర్తింపు లభించినట్లు ఆదిత్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలియజేశారు. నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో కళాశాలలో ల్యాబ్, లైబ్రరీ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది మౌలిక సదుపాయాలు తదితర అంశాలను పరీక్షించిన త్రిసభ్య బృందం సిఫారసు మేరకు నాక్-ఎ గుర్తింపు లభించినట్లు సతీష్ రెడ్డి తెలిపారు. తమ కళాశాలకు గుర్తింపు రావడం ఆనందదాయకమని దీనికి కృషిచేసిన అధ్యాపక బృందానికి అభినందనలు తెలియజేశారు. సమావేశంలో క్యాంపస్ డైరెక్టర్ ఎం.శ్రీని వాస్ రెడ్డి, ప్రిన్సిపాల్. కె.రవిశంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సతీష్‌రెడ్డి

అప్పు పుట్టక.. ఇల్లు కట్టలేక..

- 'వ్యయ' ప్ర'ఆ'సలతో లబ్ధిదారులు
- ఇల్లు కడితేనే స్థలం అంటున్న అధికారులు
- పెరిగిన ఇంటి నిర్మాణ ఖర్చులు
- జగనన్న కాలనీల్లో కానరాని మౌలిక వసతులు
- ఉగాది నాటికి 18,080 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేనా..?

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

అప్పు పుట్టక.. ఇల్లు కట్టలేక పెరిగిన ఇంటి నిర్మాణ ఖర్చులు తాళలేక, వ్యయ ప్రయాసలతో లబ్ధిదారులు తలమునకలవుతుంటే పూర్తి మౌలిక వసతులు కల్పించకుండా ఇల్లు కట్టుకుంటేనే స్థలం అని లేకుంటే వెనక్కు తీసు కుంటామని చెబుతూ.. అధికారులు జగనన్న కాలనీలలో ఉగాది నాటికి సుమారు 18 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలనే అంచనాలతో లబ్ధిదా రులను అవగాహన పేరుతో ఇబ్బంది పెడుతూ ఇళ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించక పోతే ఇంటి స్థలాలను వెనక్కి తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న అరకొర సొమ్ము ఏమాత్రం సరిపోవటం లేదు. మెటీరియల్ ధరలు చూస్తే విపరీతంగా పెరిగిపోయాయి. ఇంటి నిర్మాణం చేయాలంటే అప్పులు చేయక తప్పడం లేదని సామర్లకోట మండలం పి.వేమవరం గ్రామానికి చెందిన ఎస్ దుర్గాలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు లే అవుట్ లలో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో కూలి ఖర్చులు రెట్టింపు అవుతున్నాయని తెలిపారు.

జిల్లాలో జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు నత్తనడకన జరుగుతున్నాయి. అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ ఒత్తిళ్ళు తీసుకొస్తున్నా లబ్దిదారులు వెనక దుగు వేస్తూనే ఉన్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న రూ.1.80 లక్షలు ఏమాత్రం సరిపోవటం లేదని, ఇంకోవైపు పలు లేఅవుట్లలో మౌలిక సదు పాయాలు కల్పించకపోవడంతో నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. కూలీ సొమ్ము నుంచి, రవాణా చార్జీల వరకు అదనపు ఖర్చులు అవుతున్నాయని అనేకమంది లబ్దిదారులు నిర్మాణాలను నత్తనడకన సాగిస్తున్నారు.



ఉగాది నాటికి నిర్మాణాలను పూర్తిచేయాలని వేట్లపాలెంలో ఆదేశాలిస్తున్న జడ్‌పి సిఇఒ (ఫైల్)

● ఉగాది నాటికి లక్ష్యం చేరుకునేనా...?

కాకినాడ జిల్లాలో 2020 డిసెంబరులో మొదటి విడతలో 64,621ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. ఇప్పటివరకు సుమారు 11,700 నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. అయితే ఈ ఉగాది నాటికి 18,080 ఇళ్లు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని లబ్ధిదారుల వెంటపడు తున్నారు. వారిపై ఒత్తిళ్లు తీసుకొస్తున్నారు. కచ్చితంగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. ప్రారంభించన వారికి నోటీసులు ఇస్తున్నారు. స్థలాలు ప్రభుత్వం వెనక్కి తీసేసుకుంటుందంటూ హెచ్చరిస్తున్నారు. సుమారు 52 వేల ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు తెలిపారు. అయితే వీటిలో దాదాపు 41 వేల ఇళ్లు పునాదుల దశల్లోనే ఉండడం గమనార్హం. అయితే పిఠాపురం, తుని, పట్టణాలతో సహా గండేపల్లి జగ్గంపేట, సామర్లకోట తదితర మండలాల పరిధి పలు ప్రాంతాల్లో ఉన్న జగనన్న లేఅవుట్లలో నేటికీ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. అనేకమందికి పట్టాలు ఇచ్చినా స్థలాలు చూపించక పోవడంతో లబ్దిదారులు గగ్గోలు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో మూడ నెల రోజుల్లో రానున్న ఉగాది నాటికి నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎలా చేరతారోనని ప్రశ్నలు వినిపిస్తున్నాయి. దీంతో పాటు పలు కాలనీల్లో మౌలిక సదుపాయాలు ఎక్కడ కనిపించడం లేదు. రోడ్లు, డ్రైన్లు, విద్యుత్, ప్రధానంగా నీటి సౌకర్యం లేకపోవడంతో లబ్దిదారులు నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. మరోవైపు ఐరన్, సిమెంట్, ఇసుక ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రభుత్వం సరఫరా చేస్తున్న మెటీరియల్ 30 శాతం పనులకు కూడా సరిపోవడం లేదు. పునాది పనులు చేపట్టాలంటే రూ.1.50 లక్షల నుంచి రూ. 2 లక్షల వరకు ఖర్చు అవుతుంది. కొన్ని లోతట్టు ప్రాంతాల్లో రూ.3 లక్షల వరకు వెచ్చించాల్సి వస్తుంది. ఈ తరుణంలో మొత్తం ఇంటిని పూర్తి చేయాలంటే కనీసంగా రూ. 10 లక్షల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. నిరుపేదలైన లబ్ధిదారులు అప్పులు చేసి నిర్మాణాలను చేపట్ట లేకపోతు న్నారు. నిర్మాణాలు పూర్తి చేసేందుకు అప్పులు చేద్దామన్నా పలువురికి అప్పులు పుట్టని పరిస్థితి ఏర్పడింది.



ఇంటి నిర్మాణాలు మొదలు కాని సామర్లకోట మండలం బ్రహ్మానందపురం లేఅవుట్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెసి ఇలక్కియా, పశువైద్యాధికారులు

గాలికుంటు టీకాలు ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ

కేంద్ర ప్రభుత్వ జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ద్వారా నెల రోజుల పాటు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తెలిపారు. బుధవారం కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ వద్ద గల జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని జెసి ఇలక్కియ, పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎస్.సూర్యప్రకాశరావు ఇతర పశువైద్య అధికారులతో కలిసి ప్రారంభించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 2,90,000 పశువులకు ఈ టీకాలు వేయనుండాలనే లక్ష్యంతో ఈ నెల ఒకటో తేదీ నుంచి 31 వరకు ఈ టీకా కార్యక్రమం ప్రతి గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని జెసి పిలుపునిచ్చారు. గాలికుంటు వ్యాధిని కాలికుంటు వ్యాధి, గాలికాళ్ళ వ్యాధి, నోటిగాళ్ళ వ్యాధి ఇలా వివిధ పేర్లతో పిలుస్తారని, ఇది తీవ్ర అంటువ్యాధి అని పశుసంవర్ధక శాఖ జేడీ ఎస్ సూర్యప్రకాశరావు వివరించారు. ఈ వ్యాధివల్ల పశువులు మరణిస్తే రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందన్నారు. ఒక పశువు నుంచి మరో పశువుకు త్వరగా వ్యాధి సంక్రమిస్తుందని, ఈ వ్యాధి సోకడం వల్ల పాల ఉత్పత్తి బాగా తగ్గి, పశువులు, జీవాల పెరుగుదల రేటు క్షీణిస్తుందని ఆయన తెలిపారు. గాలికుంటు వ్యాధిపై పాడి రైతులకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన వాల్‌పోస్టర్‌ను జేసీ ఇలక్కియ పశువైద్య అధికారులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డీడీలు డాక్టర్ ఆర్.వెంకటరామయ్య, డాక్టర్ జి.శ్రీనివాస, ఏడి.హెచ్. డాక్టర్ నిర్మలకుమారి, ఇతర పశువైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కూలిన ఏలేశ్వరం- అప్పన పాలెం మధ్య గల వంతెన

కుంగిన వారధి కుప్పకూలింది

ప్రజాశక్తి - ఏలేశ్వరం

గతంలో సంభవించిన వరదలకు కుంగిన ఏలేరు ప్రధాన కాలువపై ఏలేశ్వరం -అప్పన్నపాలెం మధ్యగల వారధి బుధవారం కుప్పకూలిపోయింది. అప్పటికి వారధిపై పాదసారులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వారధి కుంగినప్పటినుండి ఎటు వంటి వాహనాలు అప్పన్నపాలెం వైపు తిరగకుండా అధికారులు కట్టడి చేశారు. ఈ వారధిపై ద్విచక్ర వాహనాలు పాదచారులు తిరుగుతుండేవారు. ఏలేశ్వరంలో ఒక వార్డ్‌గా ఉన్న అప్పన్నపాలెం వాసులు ఏలేశ్వరం రావాలంటే మామిడాడ, ఇరుపాక, ఎర్రవరం మీదుగా 20 కిలోమీటర్లు తిరిగి రావాల్సిందే. జగ్గం పేట నియోజకవర్గంలోని మామిడాడ, నరేంద్రపట్నం, కాండ్రేగుల గ్రామ ప్రజలు అనునిత్యం విద్యా, వైద్యం, మార్కెటింగ్ పనుల నిమిత్తం ఏలేశ్వరం రావాల్సిందే. ఈ విషయం దృష్టిలో ఉంచుకొని 1990లో ఈ వారధిని నిర్మించారు. అయితే కుంగిపోయి మూడున్నర సంవత్సరాలు కావస్తున్న అధికారులు కానీ ప్రజా ప్రతి నిధులు కానీ ఈ వారధి నిర్మాణాలపై దృష్టి పెట్టలేదు. కుంగిన సమయంలో మూడు పిల్లర్స్ స్థానంలో నూతన పిల్లర్స్ ఏర్పాటుచేసి వారధి మరమ్మతులు చేపట్టి కొన సాగించవచ్చని పలువురు అంచనా వేశారు. అయితే క్రమేపీ నీటి తాకిడికి మిగిలిన పిల్లర్స్ కూడా కుంగుతూ వచ్చాయి. వెంటనే ఈ వారధి నిర్మాణాలు చేపట్టక పోతే అప్పన్నపాలెం, ఇరుపాక, నరేంద్ర పట్నం, మామి డాడ, కాండ్రేగుల గ్రామ స్తులు విద్యార్థులు, రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారు. సంబంధిత అధికారులు ప్రజాప్రతి నిధులు నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పెద్దాపురం సిడిపిఒగా ఉష , ఎసిడిపిఒగా జ్యోతి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓగా జి.ఉష బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఆమె సామర్లకోట సిడిపిఓగా, పెద్దా పురం ఇన్చార్జి సిడిపిఓగా బాధ్యతలు నిర్వహించారు. అలాగే పెద్దాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు అడిషనల్ సిడిపిఓగా ఎ.జ్యోతి బాధ్యతలు చేపట్టారు. సామర్లకోట రూరల్ ఐసిడిఎస్ సూపర్వైజర్‌గా విధులు నిర్వహించిన ఆమె పెద్దాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు అడిషనల్ సిడిపిఓగా పదోన్నతిపై నియమితులయ్యారు.



సిడిపిఓ ఉష




అడిషనల్ సిడిపిఓ జ్యోతి

ఆదివారమూ చెత్త సేకరణ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఆదివారం కూడా చెత్త సేకరణ జరగాల్సిందే నని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు స్పష్టం చేశారు. బుధవారం ఆయన వెంకటేశ్వర కాలనీ ప్రాంతంలో ఇంటింటికి చెత్త సేకరణ, తడి-పొడి చెత్తను విభజించి ఇస్తున్న విధానాన్ని పరిశీలించారు. పారిశుధ్య సిబ్బంది సక్రమంగా వస్తున్నారో లేదో ప్రజలను ఆరా తీశారు. ఈ సందర్భంగా స్థానికులు ఆదివారం చెత్తను తీసుకు వెళ్లేందుకు వాహనాలు రావడం లేదని కమిషనర్ దష్టికి తీసుకువచ్చారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ చెత్తను తరలించేందుకు నియమించిన ఏజెన్సీకి ఆదివారం కూడా సొమ్ము చెల్లిస్తున్నామని, అలాంట ప్పుడు చెత్తను తీసుకువెళ్లకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఏజెన్సీకి సొమ్ములు చెల్లిస్తూ... ఆదివారం ప్రజల నుంచి చెత్తను సేకరించకపోతే చెల్లించిన సొమ్మును ఆయా శానిటరీ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శుల నుంచి రికవరీ చేస్తామని హెచ్చరించారు. దీనిపై సంబంధిత శానిటరీ ఇన్స్పెక్టర్లు చొరవ తీసుకుని నిర్వాహకులతో మాట్లాడాలని, సేవలు మెరుగు పరిచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రైనేజీలపై స్లాబులు వేసే సమయంలో లోపల ఉన్న రాళ్ళు, ఇతర వ్యర్థాలను తొలగించక పోతే భవిష్యత్తులో మురికి నీటి పారుదలకు తీవ్ర అవరోధంగా ఉంటుందన్నారు. ఈ విషయమై ఇంజనీరింగ్, పారిశుధ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ కోరారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

కార్టూ'నిజం'



గ్యాస్ ధరల పెంపును ఉపసంహరించాలి

ప్రజాశక్తి - కాకినాడ

కేంద్ర బిజెపి ప్రభుత్వం గృహ వినియోగానికి ఉపయోగించే ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ ధర రూ.50, వాణిజ్య సిలెండర్ రూ.350 పెంచడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. పెంపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటి సామాన్య ప్రజలు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని, గ్యాస్ ధరలు రెండు నెలల వ్యవధిలోనే రెండు సార్లు పెంచడం దారుణమన్నారు. 3 సంవత్సరాల క్రితం రూ.417 ఉన్న డొమెస్టిక్ గ్యాస్ సిలెండర్ ధర నేడు రూ.1155కు పెరిగిందని, ప్రభుత్వం సబ్సిడీ జమలు రెండు సంవత్సరాల నుండి నిలిపివేసిందన్నారు. ఇప్పటికే గృహ వినియోగానికి సబ్సిడీ కింద ఇచ్చే సిలెండర్ల సంఖ్య కుదించార న్నారు. ఇది పూర్తిగా పేద, మధ్యతరగతిపై దాడి అని అన్నారు. వాణిజ్య సిలెండరు ఒక్కసారిగా రూ.350 పెంచడం వల్ల స్వయ ఉపాధి పొందుతున్నవారు, చిరు వ్యాపారులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ఉపాధి లేక, వేతనాలు చాలక ద్రవ్యోల్బణం పెరిగిపోతున్న నేపథ్యంలో ధరలు నియంత్రించాల్సిన ప్రభుత్వం కార్పొరేట్లకు రాయితీలిచ్చి దేశాన్ని దోచి పెడుతున్నారని ఆయన విమర్శించారు. వంట గ్యాస్ ధరల పెంపును ఉపసంహరించి, సబ్సిడీని పునరుద్ధరించాలని రాజశేఖర్ డిమాండ్ చేశారు. ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా జరిగే నిరసన కార్యక్రమాలలో ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు. **సామర్లకోట** హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కాకినాడ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు మాట్లాడుతూ పెరిగిన గ్యాస్ ధరలను తగ్గించక పోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ కాకినాడ జిల్లా కార్యదర్శి కె బోడకొండ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, పార్టీ సీనియర్ నాయకులు పి.సత్యనారాయణ, పిఎస్,.నారాయణ, రామదాసు, సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.



గ్యాస్ ధరల పెంపుపై నిరసనగా ధర్నా చేస్తున్న నాయకులు

దీపం పథకం అమలు చేయాలి

- గ్యాస్‌పై సబ్సిడీ అందించాలి : మాజీ ఎంఎల్ఎ అనంతలక్ష్మి

ప్రజాశక్తి - కరప

వంట గ్యాస్‌ను పెంచడం దుర్మార్గం అని కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణమూర్తి అన్నారు.బుధవారం ఇంటింటికి మీ అనంత లక్ష్మి, ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా పెనుగుదురు గ్రామంలో బుధవారం మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి కట్టెల పొయ్యిపై వంట చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం టిడిపి శ్రేణులతో గ్రామంలో ఇంటింటా తిరిగి నిత్యావసర ధరలు పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2019లో వైకాపా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన సమయంలో రూ.600 ఉన్న గ్యాస్ సిలెండర్ ధర ప్రస్తుతం దాదాపు రెట్టింపు అయిందన్నారు. వెంటనే దీపం పథకం అమలు చేసి సబ్సిడీ అందించాలని అనంతలక్ష్మి, టిడిపి శ్రేణులు డిమాండ్ చేశారు. మళ్లీ రాష్ట్రానికి మంచి రోజులు రావాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు, జడ్‌పిటిసి మాజీ సభ్యుడు బుంగా సింహాద్రి, టిడిపి మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు పులపకూర శుభమహేష్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ యలమంచిలి సుకుమార్, క్లస్టర్ ఇంచార్జ్ గండి వెంకటేశ్వర రావు తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.



పెరుగుదురులో కట్టెల పొయ్యిపై వంట చేస్తూ నిరసన తెలుపుతున్న మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, టిడిపి నాయకులు




సమావేశంలో పాల్గొన్న భవన నిర్మాణ కార్మికులు

క్లెయిమ్‌లను పరిష్కరించాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్ లోవున్న పరిహారాలను వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాస్, మండల గౌరవాధ్యక్షులు కరణం ప్రసాదరావులు డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల నెలవారీ సాధారణ సమావేశాలలో భాగంగా జి.మేడపాడు, పెదబ్రహ్మదేవం గ్రామాలలో నాయకులు పర్యటించి సమావేశాల్లో పాల్గొని మాట్లాడారు. 2019 నుండి భవన నిర్మాణ కార్మికులకు ఇవ్వవలసిన నష్ట పరిహారాలు, ప్రమాద పరిహారాలు, మరణాల పరిహారాలు, పెండ్లి కానుకలు, జనన పరిహారాలు తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 50 ఏళ్లు దాటిన భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ ఇవ్వాలని, సంక్షేమ పథకాలకు 60సంవత్సరాల వయసు లిమిట్ తొలగించాలని జీవితాంతం కొనసాగిం చాలని కోరారు. ఆయా సమావేశాల్లో మేడపాడు యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం రమేష్, విష్ణు, పెదబ్రహ్మదేవం అధ్యక్ష, కార్యదర్శులు పేపకాయల ప్రసాద్, పాల్ ప్రసాద్ పాల్గొన్నారు.



రామవరంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

రసాయనాలు వద్దు.. నవ ధాన్యాలు ముద్దు

- ప్రకతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - జగ్గంపేట

ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల నాణ్యమైన ఆరోగ్యకరమైన దిగుబడులను పొందవచ్చని మండల ప్రకతి వ్యవసాయ అధికారి అన్నారు. జగ్గంపేట మండలం రామవరంలోని రసాయనాలు వద్దు... నవధాన్యాలు ముద్దు...అంటూ స్థానిక సర్పంచ్ సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో రాయవరంలో ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ శాఖ మాస్టర్ ట్రైనర్ సంతోష్ మాట్లాడుతూ ఏడాది కాలంలో పండించే ఖరీఫ్ రవి పంటల సాగు ముందు నవ ధాన్యాలను భూమిలో విత్తడం వల్ల లాభాలు ఉంటాయని, ఒకటన్ను పచ్చిరొట్ట ఎరువులు వల్ల భూమిలో 30 టన్నుల సూక్ష్మజీవుల, సూక్ష్మ పోషకాల పెరుగుతాయని అన్నారు. తర్వాత వేసిన ఖరీఫ్, రబీ పంటల సాగులో నాణ్యమైన దిగుబడితోపాటు ఆరోగ్యకరమైన పోషక విలువలు కలిగిన పంటను పొందవచ్చు అన్నారు. ర్యాలీలో బి.అరుణ, ఎంపియుపి పాఠశాల హెచ్ఎం అజ్జేశ్వరరావు, యానిమేటర్లు, ప్రకతి వ్యవసాయ సిబ్బంది కృష్ణార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

సామర్లకోట ఎస్ఐగా గోపాలకృష్ణ

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట ఎస్ఐగా సిహెచ్.గోపాలకృష్ణ ఈయన స్థానిక ఎస్ఐగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం గోపాలకష్ణ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు అందరూ సహకరించాలని కోరారు. బాధ్యతలు స్వీకరించేందుకు విచ్చేసిన ఎస్ఐకు స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు. ఇప్పటి వరకు ఈయన తుని టౌన్ ఎస్ఐగా పనిచేశారు.

నిబంధనల ప్రకారం రీసర్వే రాళ్ల ఏర్పాటు

ప్రజాశక్తి - పెదపూడి

జగనన్న భూ రక్ష. జగనన్న భూ సమగ్ర రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సరిహద్దుల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న రాళ్ల ఏర్పాటు నిబంధనల ప్రకారం చేపట్టాలని జడ్‌పి సిఇఒ ఎన్.వి.వి.సత్యనారాయణ ఆదేశించారు. పెదపూడి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. మండలంలోని 18 గ్రామాలకు గాను 11 గ్రామాల్లో భూ రీసర్వే ప్రక్రియ పూర్తయిందన్నారు. ఆయా గ్రామాల్లో సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయడానికి మండలానికి ఎ, బి కేటగిరీల్లో 13,707 రాళ్లు వచ్చాయన్నారు. వాటిలో ఎ- కేటగిరి రాళ్లు గ్రామాల సరిహద్దును, బి-కేటగిరి రాళ్లు గ్రామాల పరిధిలో ప్రజల భూ స్థలాల సరిహద్దును సూచిస్తాయన్నారు. ఇప్పటి వరకు 520 రాళ్లు ఏర్పాటు పూర్తయిందన్నారు. మండలంలో మూడు బృందాలు ఏర్పాటు చేశామని ఆ బృందాలు రోజుకు 150 రాళ్లు ఏర్పాటు చేసే విధంగా పర్యవేక్షించాలని సిఇఒ సత్యనారాయణ ఆదేశించారు. సమావేశంలో ఎంపిడిఒ పి.విజయభాస్కర్, తహశీల్దార్ టి.సుభాష్ ఎంపిపి కేతా తులసి, జడ్‌పిటిసి పేప కాయల వెంకటలక్ష్మి, ఇఒపిఆర్‌డి కె.హరికృష్ణ, సత్యరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాదగయలో హుండీల ఆదాయం రూ.15 లక్షలు

ప్రజాశక్తి - పిఠాపురం

ప్రముఖ పుణ్యక్షేత్రం పాదగయలో హుండీల లెక్కింపు బుధవారం నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి ఫణీంద్ర కుమార్ పర్యవేక్షణలో 43రోజుల హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.15,02,769 వచ్చింది. ఈ లెక్కింపులో దేవస్థానం చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, ఇఒలు ఆర్.సౌజన్య, వి.శ్రీనివాసరావు, ధర్మ కర్తలు ఉమామేశ్వరరావు, సత్యనారాయణ, గణేష్, ఆదినారా యణ, గాయిత్రి, దేవస్థానం సిబ్బంది, చిత్రాడ సేవ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ నాయకుల నిర్బంధం అప్రజాస్వామికం

ప్రజాశక్తి - కాకినాడ

ముఖ్యమంత్రి ఎక్కడికెళ్లినా ఉపాధ్యాయ నాయకులను నిర్బంధంలోకి తీసు కోవడం అప్రజాస్వామికమని కాకినాడ జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు యన్.ఫిలిప్ రాజు, కె.యస్.సుబ్రహ్మణ్యం ఖండించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల ఒకటో తేదీన ముఖ్యమంత్రి జగన్ నిడదవోలు శాసన సభ్యుని ఇంట్లో వివాహ కార్యక్రమానికి వస్తున్న సందర్భంగా నిడదవోలులో నివాసం ఉంటున్న ఏపీటీఎఫ్ తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సువర్ణ రాజును నిర్బంధలోకి తీసుకోవడాన్ని అప్రజా స్వామికమన్నారు. ఉపాధ్యాయ నాయకులను గూండాలు, రౌడీ షీటర్లు, సంఘ విద్రోహ శక్తుల మాదిరిగా ముందస్తు అరెస్టులు చేసి, నిర్బంధించడాలు పభుత్వాలకు తగదన్నారు. ఉపాధ్యాయులను, ఉపాధ్యాయ సంఘ నాయకులను చూసి ప్రభుత్వం ఎందుకు భయపడుతున్నదో అర్థం కాని విషయ మన్నారు. వెంటనే సువర్ణరాజును విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్య వాదులు ఈ అక్రమ నిర్బంధాన్ని ఖండించాలనికోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ రమణ

బాల్య వివాహ నిషేధ చట్టం పటిష్టం

ప్రజాశక్తి - కాకినాడ

బాల్య వివాహ నిషేధ చట్టం-2006ను పటిష్టంగా అమలుచేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కాకినాడ ఆర్‌డిఒ బీవీ రమణ అన్నారు. బుధవారం కలెక్టరేట్ విధానగౌతమి సమావేశ మందిరంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, చిన్నారులపై లైంగిక దాడులు, చైల్డ్ బెగ్గింగ్‌తో పాటు గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో అనాధలు, పాక్షిక అనాధల గుర్తింపు ప్రక్రియ తదితర అంశాలపై కాకినాడ డివిజన్ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

బాల్య వివాహ నిషేధ చట్టం పటిష్ట అమలుకు, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐసీడీఎస్ రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచిం చారు. ప్రధానంగా బ్లాక్‌స్పాట్స్‌పై దష్టిసారించాలన్నారు. బాల్య వివాహ నిషేధ చట్టం పరిధిలో ఉల్లంఘనలకు కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. బాల్య వివాహాలపై 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్), 100 (పోలీస్)కు ఫోన్ చేసి సమాచార మివ్వాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ ఏపీ ఎస్‌సీపీసీఆర్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులతో కలిసి బాల్య వివాహం అంటే బాలల వేధింపే శీర్షికతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. బాల్య వివాహాలపై ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం.13లోని అంశాలను డీసీపీవో సీహెచ్ వెంకటరావు వివరించారు. సమావేశంలో డిఇఒ కేవీఎస్ అన్నపూర్ణ, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, సీడీపీవో దుర్గాదేవి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎల్.పావని, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సమన్వయ శాఖల అధికారులు తదితరులు హాజరయ్యారు.

నేరాలు ఘోరాలు

మైనర్‌తో పెళ్లి...

వాట్సాప్‌లో తొలి రాత్రి ఫొటోలు పెట్టిన భర్త
రిమాండ్‌లో నిందితుడు

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండలంలోని మత్స్యకార గ్రామమైన బలుసుతిప్పలో మైనర్‌ను వివాహం చేసుకోవడమే కాకుండా, ఆమెతో గడిపిన తొలిరాత్రి ఏకాంత చిత్రలను వాట్సాప్ ద్వారా ప్రచారం చేసిన భర్తను పోలీసులు అరెస్టుచేశారు. కాట్రేనికోన ఎస్ఐ టి.శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు బలుసుతిప్పకు చెందిన మైనర్‌ను ఈ ఏడాది మల్లాడి వీరబాబు అనే యువకుడు ఫిబ్రవరి 8న వివాహం చేసుకున్నాడు. మొదటి రాత్రి ఆమెతో ఏకాంతంగా గడిపిన ఫొటోలను మొబైల్‌లో బంధించాడు. వాటిని వాట్సాప్ ద్వారా స్నేహితులకు పంపాడు. దీనిపై ఫిబ్రవరి 20న బాధితురాలి తల్లి కాట్రేనికోన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ముమ్మిడివరం సిఐ ఎం.జానకిరామ్ విచారణ చేపట్టారు. ఫిబ్రవరి 28న నిందితుడు మల్లాడి వీరబాబు అరెస్ట్ చేసి బుధవారం ముమ్మిడివరం కోర్టులో హాజరు పరిచారు. వీరబాబుకు మేజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు. పోలీసులు ఇరువురి తల్లిదండ్రులు, వివాహం చేసిన ఫాస్టర్, గ్రామ పెద్దల వివరాలు సేకరిస్తున్నారు. మైనర్‌కు వివాహం చేసిన ఘటనలో ఉన్న వారందరిపై కేసు నమోదు చేసేందుకు పోలీసులు రంగం సిద్ధం చేస్తున్నారు.

గంజాయి అమ్ముతున్న ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండల పరిధిలోని చెయ్యేరు పంచాయతీ పరిధిలో గంజాయి అమ్మడంతో పాటు తాగుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కాట్రేనికోన ఎస్ఐ టి.శ్రీనివాస్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెయ్యేరులో మంగళవారం యువకులు గంజాయిని అమ్ముతున్న సమయంలో దాడి చేసి పట్టుకున్నామని ఎస్ఐ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

క్రైం బ్రాంచ్ పోలీసుల పేర టోకరా

ప్రజాశక్తి - పిఠాపురం

క్రైం బ్రాంచ్ పోలీసుల పేర రూ.50వేలకు టోకరా వేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు ... కె.వెంకటరమణ ఓ ప్రైవేట్ కంపెనీలో కలెక్షన్ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. ఫిబ్రవరి 14న చర్చ్ సెంటర్లో కాకినాడ వెళ్లేందుకు బస్సు కోసం ఎదురుచూస్తుండగా ముగ్గురు వ్యక్తులు వచ్చి క్రైం బ్రాంచ్ పోలీసులమని చెప్పారు. అతని వద్ద నుంచి రూ.15వేలు తీసుకెళ్లారు. అదేనెల 24న స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర బస్సు కోసం ఎదురు చూస్తుండగా ఇద్దరు వ్యక్తులు బైకుపై వచ్చి క్రైం బ్రాంచ్ పోలీసులమని, ఎస్ఐ రమ్మంటున్నారంటూ చెప్పి బైకు ఎక్కించుకున్నారు. చిత్రాడ బ్రిడ్జి వద్దకు తీసుకువెళ్లారు. ఎస్ఐ లేరని చెప్పి రూ.35వేలు ఉన్నక్యాష్ బ్యాగ్‌ను తీసుకొని మోటార్ సైకిల్‌పై వెళ్లిపోయారు. అనుమానం వచ్చిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు

గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - యానాం

యానాం పట్టణ పరిధిలో స్థానిక న్యూ బస్టాండ్ వద్ద గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం బుధవారం లభ్యమైంది. పోలీసులు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతి చెందిన వృద్ధురాలు సుమారు 55 నుండి 60 సంవత్సరాల మధ్య వయసు, చామన చాయ రంగు, ఐదున్నర అడుగులు ఎత్తు ఉంటుందని ఆమెను గుర్తుపట్టిన వారు యానాం పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని ఎస్ఐ శేరు నూకరాజు కోరారు.

ఐసిడిఎస్‌లో బదిలీలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ జిల్లాలో పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా కొత్తగా మూడు ఐసిడిఎస్ ప్రాజెక్టులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగోన్నతులు పొందారు. కరప, కాకినాడ గ్రామీణంలను కాకినాడ రూరల్ ప్రాజెక్టుగా, తుని అర్బన్, రూరల్‌ను తుని ప్రాజెక్టుగా, గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి కలిపి జగ్గంపేట ప్రాజెక్టులుగా నూతనంగా ఏర్పాటు చేశారు. తుని రూరల్ సిడిపిఒ రమణ కాకినాడ రూరల్ ప్రాజెక్టు సిడిపిఒగా, జగ్గంపేట సిడిపిఒగా ఎం.పూర్ణిమ, సామర్లకోట రూరల్ సూపర్‌వైజర్ గ్రేడ్-1గా పనిచేసిన వై.లక్ష్మిని కాకినాడ పీడీ కార్యాలయంలో నోడల్ అధికారిగా నియమించారు. సామర్లకోట రూరల్ సూపర్‌వైజర్ ఎ.జ్యోతిని పెద్దాపురం ఎసిడిపిఒగా, సామర్లకోట అర్బన్ సిపిడిపిఒ జి.ఉషను పెద్దాపురం సిడిపిఒగా, తుని అర్బన్ సూపర్‌వైజర్ ఎం.నిహారికను తుని ప్రాజెక్టు ఎసిడిపిఇఒగా, తుని అర్బన్ సూపర్‌వైజర్ గ్రేడ్-1గా చేస్తున్న ఆర్‌విఎస్.లక్ష్మిని తాడేపల్లిగూడెం ఎసిడిపిఒగా నియమించారు. వీరందరు బుధవారం బాధ్యతలు చేపట్టినట్లు పీడీ కొండా ప్రవీణ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

వడ్లమూరు గ్రామ శివారులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపిడిఒ కరక హిమమహేశ్వరి బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు పెట్టే పోషకాహారాన్ని, పిల్లలకు అందించే ఆహారాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట వైసిపి నాయకులు కంటే వీరరాఘవరావు తదితరులున్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ప్రీతి మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వరంగల్ ఎంజిఎం ఆసుపత్రిలో పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ ధరావత్ ప్రీతిబాయ్ మరణానికి కారణమైన నిందితుడు సైఫ్‌ని కఠినంగా శిక్షించాలని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, ఐద్వా, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక కోటిపల్లి బస్టాండ్ వద్ద బుధవారం కొవ్వొత్తులతో నిరసన, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి తులసి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజా, యుటిఎఫ్ నాయకులు అనిత మాట్లాడారు. తన తోటి విద్యార్థి, సీనియర్ ర్యాగింగ్‌కు, వేధింపులను తాళలేక గిరిజన యువతి ప్రీతి ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరమన్నారు. ర్యాగింగ్‌పై ప్రిన్సిపల్, హెచ్‌ఒడికి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. వారి నిర్లక్ష్యమే ప్రీతి మృతికి కారణమైందన్నారు. ఆమె మృతికి సైఫ్ మాత్రమే కారణం కాదని, కాలేజీ యాజమాన్యం కూడా కారణమన్నారు. ఆడపిల్లలుగా అనేక అవాంతరాలను, వివక్షతలను దాటుకొని ఉన్నతస్థాయికి ఎదగడానికి కృషి చేస్తుంటే ఇలాంటి ఘటనలు వారిని మరింత వెనక్కి నెట్టేలా చేస్తున్నాయనిఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని, ర్యాగింగ్ భూతాన్ని సమూలంగా నిర్మూలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాంబాబు, నిశ్చల్, ఐద్వా జిల్లా ఉపాధక్షులు సావిత్రి, సుధ, సిఐటియు నాయకులు పూర్ణిమరాజ్, కెవిపిఎస్ నాయకులు రూపస్, గవర్నమెంట్ గర్ల్స్ హై స్కూల్ విద్యార్థినిలు పాల్గొన్నారు



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ, ప్రజాసంఘాల నాయకులు

ఘనంగా ఆదిరెడ్డి దంపతుల షష్టి పూర్తి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మాజీ ఎంఎల్‌సి, టిడిపి సీనియర్ నాయకులు ఆదిరెడ్డి అప్పారావు, నగర తొలి మహిళా మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మల షష్టి పూర్తి బుధవారం ఘనంగా జరిగింది. ఆదిరెడ్డి అప్పారావు, వీర రాఘవమ్మలకు 60 ఏళ్లు నిండిన సందర్భంగా తిలక్ రోడ్డులోని వారి నివాసంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు, సిటీ ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి భవాని, వారి కుమారుడు ఆదిరెడ్డి జయేష్‌నాయుడు పాల్గొన్నారు.



షష్టి పూర్తిలో పూజలు నిర్వహిస్తున్న ఆదిరెడ్డి అప్పారావు, వీరరాఘవమ్మ

వేతన బకాయిలు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పంచాయితీ కార్మికులకు బకాయి వేతనాలు ఇవ్వాలని, నాగాల పేరుతో జీతంలో కోతలు అపాలని, కార్మికులపై వేధింపులు ఆపాలని కోరుతూ జిల్లా పంచాయతీ అధికారి జగదాంబకి ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలోలో బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ మాట్లాడారు. ఐదు నెలలుగా పంచాయతీ పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. కార్మికులతో పారిశుధ్యేతర పనులు చేయిస్తున్నారని, ఏదోకారణం చూపి నాగాల పేరుతో జీతంలో కోత పెడుతున్నారని తెలిపారు. బ్యాంకు అకౌంట్ ద్వారా జీతాలు ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశాలున్నా గ్రామస్థాయిలో అమలు కావట్లేదన్నారు. దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కొన్ని పంచాయతీల్లో గుమస్తాలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు కార్మికులను తీవ్రంగా వేధిస్తున్నారన్నారు. రంగంపేట మండలం వడిశలేరులో కార్మికులను తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారని, జీతాలు అడిగితే ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. వెంటనే జిల్లా స్థాయి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. డిపిఒ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పోతురాజు, నారాయడు, కొండియ్య, సూర్యారావు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులోవ

ఎంఎల్‌సి పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని రెండు స్థానిక సంస్థల శాసన మండలి సభ్యుల ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన కొవ్వూరు డివిజన్ పరిధిలో పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. బుధవారం సాయంత్రం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎమ్‌కె.మీనా వెలగపూడి నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, కొవ్వూరు డివిజన్ పరిధిలో 242 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారన్నారు. 107 మంది పురుషులు, 135 మంది మహిళలు, ముగ్గురు ఎంఎల్‌ఎలు ఉన్నారన్నారు. ఓటింగ్‌కు తగిన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కొవ్వూరు ఎంపిడిఒ కార్యాలయం సమావేశ మందిరంలో తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు మాధవీలత వివరించారు. స్థానిక సంస్థలకు చెందిన కొవ్వూరు మునిసిపాలిటీలో 23 మంది, నిడదవోలు పురపాలక సంఘం పరిధిలో 28 మంది, జడ్‌పిటిసి 9 మంది, ఎంపిటిసి సభ్యులు 179 మంది ఉన్నారన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ జి.నరసింహులు, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



రౌతులపూడిలో వాహన తనిఖీలు

రౌతులపూడి : రౌతులపూడిలో ప్రత్తిపాడు సిఐ కిషోర్‌బాబు అన్నవరం ఎస్ఐ శోభన్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించినా, పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దాపురం : ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు చేసినప్పుడు కొనుగోలుదారులు మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని వినియోగదారుల సంఘం అధ్యక్షులు భళ్లమూడి సూర్యనారాయణమూర్తి అన్నారు. బుధవారం స్థానిక క్రిస్టియన్ పేటలోని 12,13 వార్డుల సచివాలయంలో వినియోగదారుల చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు ఎస్ఎ మార్కు, బంగారు వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు హాల్ మార్క్ చూసి కొనుగోలు చేయాలన్నారు. మోసానికి గురైనట్లు తెలిసిన వెంటనే జిల్లా వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. సదస్సులో సచివాలయం సెక్రటరీ ఎల్.సౌజన్య, సిబ్బంది వి.సత్తిబాబు, రత్నకుమారి, ఎం.వర లక్ష్మి, వినియోగదారుల సంఘం కార్యదర్శి ఎం.భాస్కర్‌రావు, సభ్యులు కెవివి.లక్ష్మి, వాలంటీర్లు పాల్గొన్నారు.



కలువపువ్వు సెంటర్‌లో నిలిచిపోయిన ట్రాఫిక్

మండపేటలో ట్రాఫిక్ ఇక్కట్లు

మండపేట : నిత్యం రద్దీగా ఉండే పట్టణంలోని కలువపువ్వు సెంటర్లో తరచూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుండడంతో పాదచారులు, ప్రయాణికులు తీబ్బందులు పడుతున్నారు. సుమారు 40 గ్రామాలకు కేంద్రంగా ఉన్న మండపేట పట్టణంలో ట్రాఫిక్ సమస్య నానాటికీ జఠిలమవుతుంది. బైపాస్ రోడ్డు నుంచి వెళ్లాల్సిన భారీ వాహనాలు పట్టణం మీదుగా వెళ్లడం, కపిలేశ్వరపురం రోడ్డు, రాజరత్న సెంటర్లలలో వ్యాపారులు రోడ్డు మార్జిన్ వరకు విస్తరించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఆటోల నిలుపుదలతో రోడ్డు ఇరుకుగా మారి ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. స్థానిక మున్సిపల్ రోడ్డులో ఒకవైపు భవన నిర్మాణ పనులకు ఉపయోగించే ఇసుక రోడ్డు మీద వేయడంతో పాటు మరొకవైపు లారీల్లో ఇనుము తదితరు సామగ్రి లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్న నేపథ్యంలో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక కారణంగా జారిపడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంపీ భరత్ తదితరులు

డిస్నీ స్కూల్ ఆధ్వర్యంలో సైన్స్ ఎక్స్‌పో

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకొని జెఎన్ రోడ్‌లో గల డిస్నీ స్కూల్స్ వారు సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని బుధవారం స్వరూప్ నగర్‌లోని ఈట్ అండ్ ప్లే గ్రౌండ్‌లో నిర్వహించారు. స్కూల్ పిల్లలు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులను ఈ ఎక్స్‌పోలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ మార్గాని భరత్‌రామ్, రుడా చైర్మన్ షర్మిలరెడ్డి హాజరయ్యారు. ఎక్స్‌పోను తిలకించారు. వారు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు పిల్లాలో సృజనాత్మకతను మరింత పెంచుతాయన్నారు. డిస్నీ స్కూల్ కరస్పాండెంట్ షేక్ సాహిలా మాట్లాడుతూ స్కూల్ టీచర్లు, పిల్లలు, వారి తల్లితండ్రుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రానున్న రోజులో సైన్స్ అండ్ టెక్నాలజీపై విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు అడపా శ్రీహరి, దాసి వెంకట్రావు, ఎమ్‌డి అమీర్‌పాషా, ఎన్‌వి.శ్రీనివాస్, స్టేట్ హజ్ కమిటీ డైరెక్టర్ ఇబాదుల్లా, ఎమ్‌డి.అక్రమ్, ఎంహెచ్‌ఒ వినూత్న, ఐఇసి స్పెషలిస్టులు అన్నమయ్య, సైదా తబసుమ్మ్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు

పెరవలి : కాకరపర్రులోని ఎస్‌విఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం చైల్డ్ రైట్స్ కమిషనర్ ఎ.రాజేంద్రప్రసాద్, ఉమెన్ కమిషనర్ బి.వినీత బుధవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. విద్యార్థులకు భోజనం సక్రమంగా అందుతోందా లేదా అడిగి తెలుసుకున్నారు అనంతరం తయారుచేసిన భోజనం తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం సిహెచ్‌ఎన్‌వి.రెడ్డి, సుందర్ జేమ్స్, సుబ్బారావు, మూర్తి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోవింద్ సేవలు వెలకట్టలేనివి

కడియం : కడియం గ్రామానికి చెందిన వనుం గోవింద్ సేవలు వెలకట్టలేనివని రాజమహేంద్రవరం మాజీ ఎంపీ గిరిజాల వెంకటస్వామి నాయుడు అన్నారు. ఇటీవల మతి చెందిన గోవింద్ కుటుంబాన్ని ఆయన పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోవింద్ పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొని ఎంతోమంది యువతకు మార్గదర్శి అయ్యాడని కొనియాడారు. గ్రామంలో అందరితో ఆప్యాయతతో పలకరించేవాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనుం సూరిబాబు , గంధం వెంకన్న , ఎస్.వీర నాగు , పసల రమణ , తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు పోరాటం

ప్రజాశక్తి - పెద్దాపురం

భవన నిర్మాణ కార్మికు సంక్షేమ బోర్డును పునరుద్ధరించేవరకూ ఎఐటియుసి ఆధ్వర్యంలో రాజీ లేని పోరాటం చేస్తామని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు తాటిపాక మధు అన్నారు. బుధవారం తాడితోటలోని తాపీ వర్కర్స్ యూనియన్ భవనంలో పిఎస్ నారాయణ అధ్యక్షతన జరిగిన పెద్దాపురం డివిజన్ ఎటియుసి మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. తొలుత ఎఐటియుసి జెండాను తాటిపాక మధు ఆవిష్కరించారు. అనంతరం ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడారు. భవన నిర్మాణ రంగంలో వసూలు చేస్తున్న సెస్ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికే వినియోగించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యంతో పాటు బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షులుగా బి.మురళీకృష్ణ, ఉపాధ్యక్షులుగా ఎం.భాస్కరరావు, కె.కిషోర్, జి.బాబూరావు, ప్రధాన కార్యదర్శిగా పి.సత్యనారాయణ తదితరులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.

యానాం వార్తలు



కార్మికులతో సిఐటియు జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్

కార్మిక సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

యానాం నియోజకవర్గ పరిధిలో అడవి పొలం గ్రామంలో ఉన్న రుంగ్త ఇరిగేషన్ లిమిటెడ్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలన లేకుంటే సమ్మెకు దిగుతామని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ స్పష్టం చేశారు. ఈ మేరకు కార్మికులతో కలిసి ఆయన బుధవారం యానాంలోని లేబర్ ఇన్‌స్పెక్టర్‌ను కలిశారు. కార్మికుల సమస్యలను వివరించారు. దీనికి ఆయన స్పందించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు యాజమాన్యంతో సమావేశం నిర్వహించి సమస్యలకు పరిష్కారం చూపుతామని లేబర్ ఇన్‌స్పెక్టర్ తెలిపినట్టు దుర్గాప్రసాద్ చెప్పారు. కార్మికుల శ్రమను గుర్తించి యాజమాన్యం సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు. డిమాండ్లను నెరవేర్చకుంటే కార్మికులందరూ సమ్మెకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణ, నాగేశ్వరరావు, మట్టా ప్రసాద్, మధుబాబు, సత్యనారాయణ, రాజశేఖర్, సుబ్బరాజు, నాగేశ్వరరావు, శ్రీను పాల్గొన్నారు.



ఎంఎల్ఎ అశోక్, మల్లాడి వాగ్వాదం

పింఛన్ల పంపిణీలో ఉద్రిక్తత

ఎంఎల్ఎ అశోక్, మల్లాడి వాగ్వాదం

ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేస్తా : ఎంఎల్ఎ గొల్లపల్లి

పుదుచ్చేరి ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన వద్ధాప్య, వితంతు పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో బుధవారం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. తాను చేసిన నిరాహారదీక్షా ఫలితంగా ప్రభుత్వం 550 మందికి వధాప్య, వితంతు పింఛన్లను మంజూరు చేసిందని, ఎంఎల్ఎ హోదాలో పింఛన్లు పంపిణీ తానే చేయాల్సి ఉందని, ప్రొటోకాల్ నిబంధనలకు విరుద్ధంగా ఈ కార్యక్రమానికి మల్లాడి కృష్ణారావు ఎందుకు వచ్చారని ఎంఎల్ఎ అశోక్ ప్రశ్నించడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో అక్కడే ఉన్న ఆర్ఎఒ మునిస్వామి ఇద్దరికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ప్రొటోకాల్‌కు విరుద్ధంగా సమావేశానికి వచ్చినప్పటికీ తాను మల్లాడిని గౌరవించానని, పంపిణీ జరుగుతున్న సమయంలో లబ్ధిదారులు తన వద్దకు వచ్చి పింఛనుపత్రం స్వీకరిస్తుంటే మల్లాడి అడ్డుకుని తనవద్దకే లబ్ధిదారులను పంపాలని అనడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. ప్రొటోకాల్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై పుదుచ్చేరి అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేయనున్నట్లు ఎంఎల్ఎ అశోక్ తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఒ మునిస్వామి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రెయ్యా శ్రీనివాస్, ఎస్‌పి రఘునాయగం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లూర్ధుమాత మహోత్సవం

కేంద్రపాలిత ప్రాంతమైన యానాం రోమన్ కేథలిక్ చర్చ్‌లో లూర్ధుమాత యాత్ర మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిఫాదర్ మరియాదాస్ మాట్లాడుతూ ఈ ఉత్సవానికి క్రైస్తవులే కాకుండా కుల మతాలకతీతంగా ప్రజలందరూ వచ్చి ప్రార్థనలు చేసి కొవ్వొత్తులు వెలిగిస్తారని తెలిపారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై లూర్ధుమాతను ప్రతిష్ఠించి రాత్రి 8 గంటలకు ఊరేగించారు.

విద్యార్థుల ప్రగతిపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు

ప్రతీ విద్యార్థి ప్రగతిపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని సమగ్ర శిక్ష సిఎంఒ చామంతి నాగేశ్వరరావు అన్నారు. తాళ్లరేవులోని పలు పాఠశాలలను ఆయన బుధవారం సందర్శించారు. తాళ్లరేవు మండలంలో జై భీమ్ పేట ప్రాథమిక పాఠశాలలో ఫిజియోథెరపీ క్యాంపును ఆయన పరిశీలించారు. పి.మల్లవరం హై స్కూల్‌ను సందర్శించి వర్క్ బుక్స్, నోట్స్, ఎండిఎం, జెవికె ఐటమ్స్, టీచర్ డైరీ లెసన్ ప్లాన్స్, పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు సలహాలు అందించారు.